సాక్షి
పల్నాడు

మంగళవారం । 2 । మే । 2023



ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరు మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి గణేష్ బాబు రూ. 1,00,111 అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.5200, మోడల్ ధర రూ.3300 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

జిల్లాలో 75.69శాతం పెన్షన్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకను నెల మొదటిరోజే జిల్లాలో 75.69శాతం పంపిణీ చేశారు. జిల్లాలో ఈనెల 2,68,761 మందికి రూ.74,55.56,250లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 2,03,422 మందికి రూ.56,41,20,750లను అందజేశారు. వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి బయోమెట్రిక్ ద్వారా పెన్షన్లను పంపిణీ చేశారు. వలంటీర్లు ఇంటివద్దకు వచ్చి పెన్షన్ పంపిణీ చేయడంపై అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతంలో పెన్షన్ కోసం కిలో మీటర్ల కొద్దీ నడిచివెళ్లి గంటల పాటు ప్రభుత్వ సిబ్బంది కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే తమ ఇబ్బందులకు ఫుల్‌స్టాప్ పడిందని సంతోషం వెలిబుచ్చారు.

న్యాయమూర్తుల బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా వై.బెన్నయ్యనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ఎం.శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతన న్యాయమూర్తులకు న్యాయశాఖ సిబ్బంది స్వాగతం పలికారు.

రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా కొల్లా



అద్దంకి: ఏపీ స్టేట్ సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా అద్దంకి పట్టణానికి చెందిన కొల్లా భువనేశ్వరిని నియమిస్తూ సోమవారం ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పదవి కాల పరిమితి రెండు సంవత్సరాలు. తనకు సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా నియమించేందుకు కృషిచేసిన రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్యకు, పెద్దలకు కృతజ్ఞతలు ఆమె తెలిపారు. సాహిత్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.10 అడుగుల వద్ద ఉంది. ఇది 153.1325 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 806.00 అడుగుల వద్ద ఉంది. ఇది 32.0610 టీఎంసీలకు సమానం.

కూచిపూడి ప్రాక్టికల్స్ ప్రారంభం

మొవ్వ(పామర్రు): నాట్యక్షేత్రమైన కూచిపూడిలో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో ఎంపీఏ(మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్) నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం నుంచి ప్రాంభమైయ్యాయి. ఈ పరీక్షలకు 17మంది విద్యార్థులు హాజరయ్యారని కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తెలిపారు. ఈ పరీక్షలకు వేదాంతం పార్థసారథి ఎగ్జామినర్‌గా వ్యవహరించగా డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసరావు నట్టు వాగం ద్వారా వేదాంతం దుర్గాభవాని గాత్రం, పసుమర్తి హరినాథశాస్త్రి మృదంగం ద్వారా సహకరించారు.

గ్రామోదయం.. సత్వర పరిష్కారం

- పల్లె/వార్డు నిద్రలో భాగంగా ప్రతి గురువారం స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న వైనం
- గ్రామోదయం పేరిట శుక్రవారం సమస్యల ప్రత్యక్ష పరిశీలన
- త్వరితగతిన పరిష్కారం చూపుతున్న ప్రభుత్వ యంత్రాంగం
- ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతోందంటున్న జిల్లా కలెక్టర్



వికలాంగ పింఛన్‌కు ఇబ్బందులు తొలగించి, ఆర్థికసాయం అందజేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జేసీలను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న చిన్నారి బద్దెల అభిషేక్ తల్లి (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న జిల్లా అధికార యంత్రాంగం అమలు చేస్తున్న మరో బృహత్తర కార్యక్రమం గ్రామోదయం. ఇందులో భాగంగా జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రతి శుక్రవారం ఉదయం మండల పరిధిలోని ఓ గ్రామంలో కాలినడకన వీధుల్లో తిరిగి స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే వాటికి పరిష్కారానికి అవసరమైన పాలనా పరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అలాగే అధికారులు నడకలో భాగంగా స్థానిక ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, గ్రామ సమస్యలపై ఆరా తీసి తగిన పరిష్కారం చూపుతున్నారు. ఈ కార్యక్రమం అన్ని గ్రామాలు, వార్డులలో ఆయా అధికారులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి పల్లె/ వార్డు నిద్రలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో నిద్రిస్తున్న అధికారులు, శుక్రవారం ఉదయం గ్రామోదయం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఓ వారం మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు విడతలవారీగా పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు సైతం ఈ కార్యక్రమంలో తరచుగా పాల్గొంటున్నారు.

అక్కడిక్కడే పరిష్కారం...

గ్రామోదయం పేరుతో జిల్లా, మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తున్నప్పుడు కొన్ని సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారం చూపుతున్నారు. దీని వల్ల ఎన్నో ఏళ్లుగా పనుల్లో జరుగుతున్న జాప్యం తీరుతోంది.

- గ్రామోదయంలో భాగంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ ఇటీవల వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో కాలినడకన పర్యటించిన సందర్భంలో గ్రామానికి చెందిన రమేష్ యాదవ్ కుమారుడు బద్దెల అభిషేక్ యాదవ్(5) అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. సాంకేతిక కారణాల వల్ల వికలాంగ పింఛన్ అందడంలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయన సాంకేతిక సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపడంతోపాటు, రూ.10 వేల తక్షణ ఆర్థికసాయం అందడమే కాకుండా, బాలుడి కంటికి అవసరమైన వైద్యసేవలు సత్వరం అందించాలని జిల్లా వైద్య అధికారులను ఆదేశించారు.



చల్లగుండ్ల గ్రామ సంపద తయారీ కేంద్రం వెళ్లడానికి రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

- అదేగ్రామంలో సుమారు 250 మంది రైతులు ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు అసైన్డ్ పట్టాలకు రెవెన్యూ, అటవీ అధికారుల నుంచి వస్తున్న ఇబ్బందులను కలెక్టర్‌కు రైతులు వివరించగా, వెంటనే స్పందించిన ఆయన పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసి సమస్యకు పరిష్కారం చూపారు.

పరిష్కారమైన సమస్యలు...

- కారంపూడి మండలం కాచవరం నుంచి గుంటూరు వెళ్లే నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణకు అవసరమైన చర్యలు
- చిలకలూరిపేట 35వ వార్డులోని సాంబిశివనగర్ పార్క్ నిరుపయోగంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన అధికారులు పొక్లెయిన్ సహాయంతో పిచ్చి మొక్కలు తొలగించి, నీరు నిల్వ లేకుండా చేసి, అవసరమైన ఏర్పాట్లు చేసి పార్క్‌ను పునరుద్ధరించారు.
- నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామ చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వెళ్లడానికి దారిలేదని ఫిర్యాదు అందగా, వెంటనే జిల్లా కలెక్టర్ రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- చిలకలూరిపేట మండలం రాజాపేట గ్రామంలో అధికారులు పర్యటించినప్పుడు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా, వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అలాగే ఆ గ్రామంలో మురుగు కాలువ పారుదలకు ఇబ్బందులను గుర్తించి, వెంటనే కాలువలను శుభ్రం చేయించారు.

క్షేత్రస్థాయి పరిశీలన, పరిష్కారం

గ్రామోదయం పేరిట నాతోపాటు, జేసీ, జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామాలు, వార్డులలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తున్నాం. వాటికి వెంటనే పరిపాలనపరమైన అనుమతులను వెంటనే జారీ చేస్తున్నాం. చిన్న చిన్న సమస్యలు సైతం ఉన్నతాధికారుల దృష్టికి రావకపోవడంతో అలాగే ఏళ్లగా ఉంటున్నాయి, వాటిని గ్రామోదయంలో పరిష్కారం చూపుతున్నాం. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతోంది.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్



పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చందవరం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని – చిలకలూరిపేట

సొలస రంగనాథుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- పెండ్లికుమారుడైన రంగనాథుడు
- విశేష అలంకరణలో దేవతామూర్తులు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రంగనాయక స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి వారం రోజులు నిర్వహించనున్నారు. సోమవారం వేకువజామున ఆలయ అర్చకుడు పర్చూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. వంశాపరంపర్య ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్ దంపతులు, అర్వపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పసుపు కొట్టుడు, మెహిందీ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కొలువు ఉంచి సంప్రదాయ బద్ధంగా రంగనాథుని పెండ్లికుమారుడిగా, శ్రీదేవి, భూదేవిని పెళ్లి కుమార్తెలను చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల వార్షిక పూజలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు పలు రకాల తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షబంధనం, దీప, మండపారాధనలు, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణ, గరుడ ముద్దలు, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.



అభిషేకాల అనంతరం విశేష అలంకరణలో మూలవిరాట్



పసుపు కార్యక్రమంలో భక్తులు

సమస్యలపై సత్వరం స్పందిస్తేనే ప్రయోజనం

స్పందన అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్, జేసీ

నరసరావుపేట: స్పందనలో ప్రజలు అందజేసిన అర్జీలకు వెంటనే పరిష్కార మార్గం చూపిస్తేనే చేసిన పనికి ఫలితం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్‌ఓ కె.వినాయకంలతో కలిసి జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రజల వద్ద నుంచి 56 వినతులను స్వీకరించారు. స్పందనలో అర్జీలను ఇచ్చేందుకు తరలి వచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యుడు కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన మర్రిపూడి రామ్‌మోహనరెడ్డి తన తండ్రి రమాలక్ష్మిరెడ్డి పేరుతో 250 మందికి ఉచిత అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసిన దాతలను అధికారులు ఘనంగా సత్కరించారు. తొలుత జిల్లాకు చెందిన జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.



స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారు చెప్పేది వింటున్న జిల్లా కలెక్టర్

ప్రతి ఒక్కరూ బలవర్ధక ఆహారం తీసుకోవాలి

కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షలను ఏర్పాటు చేయగా, కలెక్టర్‌తో పాటు ఇతర శాఖల జిల్లా అధికారులు పరీక్షలను చేయించుకున్నారు. రక్తహీనతలో హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందో తెలుసుకొని అందుకు అనుగుణంగా బలవర్ధక ఆహారం ప్రతీఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటిప్లాన్ ఇవ్వకుండా సర్పంచ్ అడ్డుపడుతున్నాడు..



గ్రామంలోని సొంత స్థలంలో వైఎస్సార్ రూరల్‌హౌసింగ్ స్కీం కింద 2018లో రూ.1.5లక్షలతో ఇల్లు నిర్మించుకున్నాం. అది సరిపోకపోవటంతో 2022లో దాని పైన రెండో ఫ్లోర్ వేసుకున్నా. పంచాయతీ ప్లాన్ తీసుకోవాలని నోటీసు ఇస్తే దరఖాస్తు చేశా. టీడీపీకి చెందిన పంచాయతీ సర్పంచ్ నీ ఇల్లు పోరంబోకు స్థలంలో ఉందంటూ ప్లాన్ ఇవ్వటం కుదరదని నోటీసు ఇచ్చారు. దీనిపై తాను సర్వేయర్, తహసీల్దార్లను సంప్రదించగా వారిద్దరూ పోరంబోకు స్థలంకాదని, పట్టాభూమని రిపోర్టు ఇచ్చారు. నేను వైఎస్సార్ సీపీకి చెందిన వాడిననే కారణంతోనే సర్పంచ్ ప్లాన్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నాడు. వెంటనే నాకు ప్లాన్ ఇప్పించండి. – గోనుగుంట్ల నాగార్జున, బొగ్గరం, ఈపూరు మండలం

కార్మిక పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా మేడే వేడుకలు



పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు డొక్కా, ఎమ్మెల్సీలు రాజశేఖర్, ఏసురత్నం , ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, కిలారి వెంకట రోశయ్య

పట్నంబజారు: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే పురస్కరించుకుని సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో మంత్రి జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సుందరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల సాధన కోసం మొదలు పెట్టిన ఉద్యమంలో భాగంగా మేడే వచ్చిందన్నారు. రాష్ట్రంలో కార్మికులు వారి హక్కుల కోసం ఎటువంటి ఉద్యమాలు చేయాల్సిన పనిలేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆటో, చేనేత, క్షౌర, పారిశుద్ధ్య కార్మికులతో అన్ని రంగాల కార్మికులకు అండగా నిలబడ్డారన్నారు. సీఎం జగన్ కార్మిక పక్షపాతి అని, కార్మికుల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు మంచి చేస్తున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల స్థితిగతులు బాగుపడాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్ చట్టాలను సక్రమంగా అమలు చేస్తున్నారన్నారు. అనేక మందికి వృత్తి రీత్యా రాయితీ కల్పించి అండగా నిలిచారన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ కార్మికులకు ఎటువంటి కష్టం వచ్చినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ కార్మికుల కోసం సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను పరిరక్షిస్తూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వారికి మేలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అనేక పథకాలు తీసుకురావడంతోపాటు, పారిశుద్ధ్య కార్మికులకు సైతం జీతాలు పెంచి వారిని ఆదుకున్నారన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కష్టకాలంలో కార్మిక కుటుంబాలను తమ కుటుంబాలుగా భావించిన సీఎం వైఎస్ జగన్ అన్ని మంచి కార్యక్రమాలను వారి కోసం చేశారన్నారు. నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నేతలు తాడిశెట్టి మురళి, మండేపూడి పురుషోత్తం, గనిక ఝాన్సీ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



చేబ్రోలు మండలం నారాకోడూరులో కల్లాల్లోని మిర్చి తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షం.. పంటకు నష్టం

వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పులతో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలుచోట్ల భారీవర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి కురిసిన ఎడతెరపిలేని వర్షం పలు పంటలకు నష్టం కలిగించగా, కొల్లూరులో ఇటుక పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీసింది. అకాల వర్షం.. అదీ తెల్లవారుజాము కావడంతో ఆరబెట్టిన పంట దిగుబడులను రక్షించుకునేందుకు రైతులు పరుగులు తీశారు. ఇదిలా ఉండగా గత కొన్నిరోజులుగా భానుడి భగభగలకు భీతిల్లిన ప్రజలు వాతావరణం మార్పులతో నెలకొన్న మేఘావృత వాతావరణంతో ఉపశమనం పొందారు.

– సాక్షి, నెట్‌వర్క్



కొల్లూరు సమీపంలో వర్షానికి తడిచి పనికిరాకుండా పోయిన పచ్చి ఇటుక



రేపల్లె పట్టణంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కాసు వెంగళరెడ్డి సేవలు చిరస్మరణీయం



నరసరావుపేట: రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ జెడ్పీ చైర్మన్ స్వర్గీయ సర్దార్ కాసు వెంగళరెడ్డికి మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, నరసరావుపేట, గురజాల ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వెంగళరెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా పల్నాడురోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఎదురుగా ఉన్న విగ్రహానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలదండలు వేశారు. జిల్లాతో పాటు, నరసరావుపేట ప్రజలతో వెంగళరెడ్డికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు, నరసరావుపేట పట్టణానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆషాబేగం ఖాజావలి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలసిన గురజాల డీఎస్పీ



నరసరావుపేట: జిల్లాలో గురజాల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పల్లపురాజు, సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడాలని ఎస్పీ వారికి సూచించారు.

నటరత్నాలు సినిమా డిజిటల్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేసిన మంత్రి మేరుగ నాగార్జున

వరహాపురం(వేమూరు): నటరత్నాలు సినిమా విజయవంతం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆకాంక్షించారు. గుంటూరులోని మంత్రి కార్యాలయంలో నటరత్నాలు సినిమా పోస్టర్‌ను సోమవారం విడదల చేశారు. ఆయన మాట్లాడుతూ వేమూరు మండలంలోని వరహాపురం గ్రామానికి చెందిన యల్లమాటి చంటి నటరత్నాలు సినిమా తీసినట్లు చెప్పారు. సినిమా పరిశ్రమలో మంచి నిర్మాతగా పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోన రైల్వేస్టేషన్- వేజళ్లవారిలంక రైల్వే గేట్ మధ్య ఓ వృద్ధుడు ఆదివారం రాత్రి రైలు కింద పడి మృతి చెందిన ఘటన చెందాడు. జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ పోలీసుల కథనం.. ఆదివారం రాత్రి తెనాలి నుంచి రేపల్లె వైపు వస్తున్న రైలు కింద నగరం మండలం ధూళిపూడి సమీపంలోని ఉయ్యూరివారిపాలేనికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రేపల్లె జీఆర్పీఎఫ్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ దాసరి వేణు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ వెంకటప్పయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికులకు హక్కులు, బాధ్యతలు రెండూ ముఖ్యమే

పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్



జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

నరసరావుపేట: కార్మికులకు హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం మే డే పురస్కరించుకొని కలెక్టరేట్‌లో పలు కార్మిక సంఘాల నాయకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి జిల్లాకు చేస్తున్న కృషిని కొనియాడుతూ సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యంగా హక్కులు సాధించుకోవడమే లక్ష్యంగా మే డే ప్రతి ఏటా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే రాంబాబు, వైదన వెంకట్, సీఐటీయూ మండల కార్యదర్శి శిలార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలాస్వామిరెడ్డి, బి.ఎం.ఎస్ బంగారయ్య, బీటీసీ వర్కర్స్ యునియన్ నాయకుడు నారాయణ, న్యాయవాదుల బార్ అసోసియేషన్ సెక్రటరి అబ్బూరి ఏడుకొండలు, మండల లీగల్‌సెల్ అథారిటీ సభ్యులు శరత్‌బాబు, ఏడుకొండలు, బ్లెస్సిడేవిడ్, ఘనంగా సత్కరించారు. జిల్లా కార్మిక శాఖ అధికారిణి ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు ఆదర్శ రైతులకు సన్మానం

నరసరావుపేట: ఆధునిక సాంకేతిక విధానాలతో సేద్యం చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. ప్రతి సోమవారం స్పందన కర్యక్రమంలో ఆదర్శ రైతులను గౌరవించుకోవాలనే ఆలోచనతో ఇద్దరు రైతులను సన్మానించి, సర్టిఫికెట్లు అందజేశారు. సాధారణ విధానంలో 30 టన్నుల దిగుబడి వచ్చే బొప్పాయి పంటను రైస్డ్‌బెడ్, డ్రిప్ విధానంలో సాగుచేసి ఎకరానికి 60 టన్నుల దిగుబడి సాధించిన రాజుపాలెం మండలం వీరవల్లిపాయ గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేశ్వర్లు, 15 టన్నుల దిగుబడి వచ్చే టమాటా పంటను డ్రిప్, ట్రేలిసింగ్ విధానంలో 40 టన్నుల దిగుబడి సాధించిన రాజుపాలేనికి చెందిన చుక్కా శ్రీను సన్మానించారు.

పనులు త్వరగా పూర్తిచేయండి

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పలురకాల సంక్షేమ పథకాలు, ఆయా సర్వే పనులను జిల్లా అధికారులు త్వరగా పూర్తి చేయించాలని జిల్లాకలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎస్‌సీడీ సర్వే, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 79 శాతం సర్వే పూర్తి చేశారని దానిని 90శాతం వరకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వుయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాం ద్వారా ప్రతీ టీచర్‌కి ఒక విద్యారి ని మ్యాప్ చేయించి వారికి ఐదు పుస్తకాలు అందజేసి వాటిని వారు చదువుతున్నారో లేదో సమగ్రంగా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో ఎంపీడీఓలు, మెడికల్ అధికారులు తగిన జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. మే ఐదు నుంచి ప్రతి సచివాలయం, మండలాల్లో వలంటీర్‌లకు సన్మానాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

కార్మికుల పిల్లల ఉన్నతికి కృషి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పక్కన మద్దిరెడ్డి సుధాకరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): కార్మికులు, పేదల పిల్లలు గొప్ప ఇంజనీర్లు, డాక్టర్లు కలెక్టర్లు కావాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరావు, కార్మిక నేతలు వెంకయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులతో కలిసి సోమవారం అప్పిరెడ్డి కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ తదితరులతో కలిసి బృందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్టీయార్ స్టేడియం కార్మికులకు దుస్తులు, దుప్పట్లు, నగదు పంపిణీ చేశారు. అనంతరం శ్రీరాంనగర్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, ఆటో మురళి తదితరులతో కలిసి జెండా ఎగురవేసి, ఆటో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. అక్కడే ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా ప్రపంచ కార్మికులందరి ఉమ్మడి పర్వదినం మేడే అని వ్యాఖ్యానించారు. తాను మిర్చియార్డు చైర్మన్‌గా పని చేసిన సమయంలో కార్మికుల సహాయసహకారాలతో యార్డును ప్రగతిపథంలో నడిపించినట్లు గుర్తుచేసుకున్నారు. అందుకే మొదటి నుంచీ కార్మికుల పక్షాన పోరాడుతూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. పేరులోనే శ్రామికులు గల వైఎస్సార్ సీపీ తొలి నుంచి కార్మిక పక్షపాతిగానే వ్యవహరిస్తూ వచ్చిందని గుర్తు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు వివరించారు.

రేపల్లెలో అత్యధిక వర్షపాతం

బాపట్ల: బాపట్ల జిల్లాలో అత్యధిక వర్షపాతం 56.2 మిల్లీమీటర్లుగా నమోదు అయింది. బాపట్ల జిల్లాలో ఆదివారం కురిసిన వర్షపాతం వివరాలను జిల్లా సీపీఓ కార్యాలయం ప్రకటించింది. జిల్లాలో అత్యధికంగా రేపల్లె మండలంలో 56.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఇంకొల్లు మండలంలో 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేమూరు మండలంలో 25.4, కొల్లూరులో 41.4, చెరుకుపల్లిలో 20.4, పిట్టలవానిపాలెంలో 17.4, కర్లపాలెంలో 27.4,బాపట్లలో 38.6, నిజాంపట్నంలో 21.4, నగరంలో 30.6, సంతమాగులూరులో 12.6, బల్లికురవలో 25.4, మార్టూరులో 9.2, యద్దనపూడిలో 10, పర్చూరులో 18.2, కారంచేడులో 11.2, జె.పంగులూరులో 4.4, అద్దంకిలో 15.4, కొరిశపాడులో 8.2, చీరాలలో 29.4, వేటపాలెంలో 5.4, చినగంజాంలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 60 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 4.6 మి.మీ వర్షం పడింది. సగటున 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

- 'జగనన్నకు చెబుదాం'లో ఎస్పీ రవిశంకర్ రెడ్డి
- 52 ఫిర్యాదులు స్వీకరణ



బాధితురాలి సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రజల నుంచి అందే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాల సమస్యలకు సంబంధించిన 52 ఫిర్యాదులు అందాయి. డీఎస్పీలు విజయభాస్కరరావు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర పాల్గొన్నారు.

బైక్ చోరీలను పట్టించుకోవట్లేదు

కారెంపూడిలో వరసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. పోలీసులు పట్టించుకోవట్లేదు. 6 నెలల కాలంలో 130కు పైగా వాహనాలు చోరీకి గురయ్యాయి. అందులో మాకు సంబంధించిన రెండు వాహనాలు కూడా ఉన్నాయి.

–పువ్వాడ శ్రీనివాసరావు, శెట్టి అనీల్‌కుమార్, కారెంపూడి

నమ్మించి డబ్బులు తీసుకొని ఇవ్వట్లేదు

ఇంటి పక్కనే నివాసం ఉంటున్న వారు వడ్డీ ఇస్తామని మమ్మల్ని నమ్మించి రెండేళ్ల క్రితం రూ.1.30 లక్షలు తీసుకున్నారు. ఫోర్జరీ సంతకాలతో ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. ఇప్పుడు ప్రోనోటు రాసిచ్చిన వారిని అడుగుతుంటే మాకు తెలియదంటున్నారు. డబ్బులు తీసుకున్నా వారిని అడుగుతుంటే నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటున్నారు. మా డబ్బులు ఇప్పించి మాకు న్యాయం చేయండి.

–మీనిగ రాజేశ్వరి, పెద్దచెరువు, నరసరావుపేట

కోటప్పకొండ ఆలయ ఈఓ వైఖరిపై నిరసన

- 4వ తేదీ నుంచి ఆర్జిత సేవలకు అర్చకులు దూరం
- నోటీసు ఇచ్చిన కోటప్పకొండ ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బంది



ఆలయ ఈఓ వేమూరి గోపికి నోటీసు అందజేస్తున్న అర్చకులు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ ఆలయ ఈఓ వేమూరి గోపి వైఖరిని నిరసిస్తూ ఈనెల 4వ తేదీ నుంచి ఆలయంలో ఆర్జిత సేవలకు దూరంగా ఉండాలని ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బంది నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం నోటీసును ఈఓ గోపికి అందజేశారు. ఆలయ అర్చకులను భక్తుల ఎదుటే అసభ్యకరంగా దుర్భాషలాడటం వలన మా మనోభావాలు దెబ్బతింటున్నాయని నోటీసులో పేర్కొన్నారు. స్వామి వారి నిత్య కైంకర్యాలను సకాలంలో నిర్వహించకుండా ఈఓ అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. ఆలయ ఆగమ సంప్రదాయాలకు విరుద్ధంగా అర్చకులను బెదిరించి ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నా భరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామి వారి ధనానికి భద్రత లేకపోవడం, నిత్య కైంకర్యాలు సక్రమంగా జరగపోవడం తీవ్రంగా కలిచివేసిందని నోటీసులో వివరించారు. ఈఓకి ఇచ్చిన నోటీసులో సంతకాలు చేసిన వారిలో అర్చకులు, ఆఫీస్ సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

కార్మిక సంక్షేమానికి అనేక పథకాలు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కార్మిక శాఖ అధికారిని జి.ధనలక్ష్మి

నరసరావుపేట టౌన్: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పల్నాడు జిల్లా కార్మిక శాఖ అధికారి జి. ధనలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కల్యాణ మండపంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పథకాలపై అవగాహన లేక ఇప్పటికీ అవి పూర్తి స్థాయిలో కార్మికులు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. జనశ్రీ బీమా, ప్రసుతి లబ్ధి పథకం, దహన సంస్కార చెల్లింపు, జాతీయ పింఛన్ పథకం, వివాహ బహుమతి పథకాలు తదితర వాటిపై వివరించారు. కార్మికులకు ఏవిధమైన సమస్యలున్నా మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయసహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏ ఏడుకొండలు, జి.బ్లెసీన పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



ఆధార్ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, అధికారులు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ఆధార్ కార్డుల్లో వివరాల అప్‌డేట్ తప్పనిసరని, 2010 నుంచి 2016 మధ్యలో కార్డులు పొందిన అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అధిక శాతం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ నిర్వహిస్తున్నారని వివరించారు. గత నెల చివరి వరకు జిల్లాలో వివిధ రకాలైన 1,17,303 సేవలందించామని పేర్కొన్నారు. ఆధార్ కోసం అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఆధార్ కార్డు లేని పౌరులు, చిన్నారులు ఉండకూడదని చెప్పారు. ఆధార్ మార్పు, నమోదుకు 1947 టోల్ ఫ్రీకు నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.పద్మావతి, జిల్లా అధికారులు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బాధ్యతగా ఉద్యోగం చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



కారుణ్య పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 11 మంది కారుణ్య నియామక పత్రాలు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అర్హతమేరకు నియామక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి పాల్గొన్నారు.

తినుబండారాలపై అప్రమత్తంగా ఉండాలి: జేసీ

రోడ్డుపక్కన, తోపుబండ్లపై విక్రయించే ఆహార పదార్థాలు కొన్ని చోట్ల విషతుల్యంగా మారుతున్నాయని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వాడిన నూనెలనే పదే పదే ఉపయోగించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇటీవల టీపీసీ మీటరు ద్వారా పరీక్షించి అనేక ఇబ్బందులను గుర్తించామన్నారు. జిల్లా సహాయక ఆహార నియంత్రణ అధికారి గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ఆరు డొంకల బావి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాపురానికి చెందిన సూరినేని పోలయ్య(62) మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. ప్రతి రోజూ అమరావతిలో రిక్షా తోలుకుని జీవించే పోలయ్య తమ స్వగ్రామమైన లింగాపురానికి వెళుతున్నాడు. ధరణికోట ఆరు డొంకల బావి సెంటర్‌కు సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టటంతో ఎగిరి రోడ్డుమీద పడటంతో తీవ్రగాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15వ ఆర్థిక నిధులు విడుదల చేయాలి



జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘం నాయకులు

బాపట్ల: గ్రామపంచాయతీలకు విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు ఉయ్యూరు అప్పిరెడ్డి వినతి పత్రం అందించారు. సోమవారం స్పందనలో అర్జీ అందజేశారు. సర్పంచులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులకు రూ.2,010 కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. అర్జీ ఇచ్చిన వారిలో టి.కృష్ణమోహన్, కౌంతి శ్రీనివాసరావు, టి.అక్కల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాకినాడలో దొరికిన చీరాల బాలుడు



ధనుష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించిన జీఆర్‌పీ సిబ్బంది

కాకినాడ క్రైం: మతిస్థిమితం లేక చీరాలలోని తన ఇంటి నుంచి వచ్చేసిన ఓ బాలుడు కాకినాడ చేరుకున్నాడు. చీరాలకు చెందిన 17 ఏళ్ల కంపా ధనుష్ రెండు నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికి పోలీసులను ఆశ్రయించారు. ఆ బాలుడి ఆచూకీపై ఆరా తీసిన పోలీసులు.. అతడు కాకినాడ చేరుకున్నాడని, రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తున్నాడని నిర్ధారించుకున్నారు. దీనిపై కాకినాడ ప్రభుత్వ రైల్వే పోలీసులకు (జీఆర్‌పీ) సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలోని ఎస్సై రవికుమార్ బృందం సోమవారం ఆ బాలుడి కోసం తీవ్రస్థాయిలో గాలించారు. చివరికి ధనుష్ ఆచూకీ లభించడంతో చీరాల పోలీసుల సమక్షంలో అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

బాపట్ల టౌన్: మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఇమ్మడిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన ప్రియంక, బజార్ నుంచి రిక్షాపై ఇమ్మడిశెట్టివారిపాలెం చేరింది. రిక్షా బండి దిగి వెళ్తుండగా ఇంతలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో పురుషుడు ద్విచక్ర వాహనం నడుపుతుండగా, వెనుక వైపు కూర్చున్న మహిళ, ప్రియాంక మెడలో బంగారు గొలుసు లాక్కుంది. వెంటనే ద్విచక్రవాహనాన్ని స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయంపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి సీఎం జగన్ కృషి

– ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



చేనేత కార్మికుడు మగ్గంపై నేసిన జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. మంగళగిరిలోని చైర్మన్ కార్యాలయంలో సోమవారం పార్టీ చేనేత విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్స్, జిల్లా అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ వైఎస్సార్ నేతన్న నేస్తంతో పరిశ్రమలోని కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అతి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కమిటీలను నియమిస్తామని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి నేతన్నలంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చేనేత కార్మికుడు సొంత మగ్గంపై నేసిన జాతీయ జెండాను చిరంజీవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.